ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం, 24 జూన్ 2024 www.prajaaswaramdaily.com 2PM

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

## 44 మంది ఐఏఎస్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

## జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): తెలంగాణలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది ఐఏఎస్ ఆఫీసర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి, ట్రాన్స్‌కో సీఎండీగా రోనాల్డ్ రోస్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా సందీప్ కుమార్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శైలజా రామయ్యర్, కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రిజ్వీ, జీహెచ్ఎంసీ ఈవీడీఎం కమిషనర్‌గా ఏవీ రంగనాథ్, హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణిప్రసాద్,అటవీ, పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శిగా అహ్మద్ నదీమ్,జీఏడీ ముఖ్యకార్యదర్శిగా సుదర్శన్ రెడ్డిలను ప్రభుత్వం నియమించింది. ఒకేసారి 44 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ కావడం సచివాలయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మాజీ ఎంపీటీసీ హత్య..!

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): వారం క్రితం కనిపించకుండా పోయిన మాజీ ఎంపీటీసీ హత్యకు గురైనట్లు తెలుస్తుంది. ఘట్‌కేసర్కు చెందిన మహేష్ ఈ నెల 17 బయటకు వెళ్లిన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆయన సోదరుడు విఠల్ ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం తెల్లవారు జమామున ఎన్ఎఫ్సీ నగర్ డంపింగ్ యార్డులో మహేష్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా మాజీ ఎంపీటీసీ మహేష్ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనే దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రైల్వే ఫ్లైఓవర్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): ఘట్కేసర్ పట్టణంలో రైల్వే ఫ్లైఓవర్ వంతెన పైనుంచి దూకి బీటెక్ విద్యార్థిని సోమవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విద్యార్థిని వంతెనపై నుంచి దూకిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఖయ్యూం మోటార్ సైకిల్ పై ఘట్కేసర్ కమ్యూనిటీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విద్యార్థిని ఘట్కేసర్ మండలం అవుషాపూర్ గ్రామం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నట్టు గుర్తించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.





# కొలువుదీరిన 18వ లోక్‌సభ..

## ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ



## తొలి రోజు 280 మంది ఎంపీలు ప్రమాణం

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): 18వ లోక్ సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ .. సభ్యులతో ప్రమాణస్వీకార కార్యక్రమం చేపట్టారు. లోక్ సభాపక్ష నేతగా ప్రధాని మోదీ తొలుత ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే ఎన్డీయే కూటమి సభ్యులంతా మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్ సభ సభ్యులుగా ప్రమాణం చేయిస్తున్నారు. తొలి రోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారితో మంగళవారం ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 26న స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27న రాజ్యసభ కూడా ప్రారంభం కానుంది. అదే రోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు.

**'ఇండియా' కూటమి సభ్యుల నిరసన**

లోక్ సభ సమావేశాల్లో ప్రొటెం స్పీకర్ గా బీజేపీనేత మహతాబ్ ను నియమించడం పట్ల ఇండియా కూటమి నేతలు నిరసన తెలిపారు. పార్లమెంటు ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట రాజ్యాంగ ప్రతులను చేతపట్టి ఆందోళన చేపట్టారు. బీజేపీ రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘిస్తోందని పలువురు ఎంపీలు ఆరోపించారు. ఎక్కువసార్లు లోక్ సభకు ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ సురేష్ ను పక్కన పెట్టి భర్తృహరిని ప్రొటెం స్పీకర్ గా నియమించడం సరికాదని తెలిపారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ఖర్గే, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు ప్రొటెం స్పీకర్ ప్యానెల్ లో ఉన్న ముగ్గురు ప్రతిపక్ష ఎంపీలు సురేష్ కోడికున్నిల్, తలికోట్టై రాజుతేవర్ బాలు, సుదీప్ బందోపాధ్యాయలు పార్లమెంటుకు హాజరుకాలేదు. కాగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు సభలో చుక్కెదురైంది. ప్రమాణ స్వీకారానికి ఆయన పేరును పిలవగానే ప్రతిపక్షాలు నీట్-నీట్ అంటూ నినాదాలు చేశారు. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

# హిస్టరీ రిపీట్..

## ఎమ్మెల్యేలు పార్టీ వీడటంపై కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): బీఆర్ఎస్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై పవర్ కోల్పోవడంతో ఎమ్మెల్యేలు గులాబీ పార్టీని వీడుతున్నారు. మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా స్పందించారు. 'అధికారంలో ఉన్న వ్యక్తుల కంటే ప్రజల శక్తి ఎల్లప్పుడూ బలంగా ఉంటుంద'ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో 2004-2006లో కూడా ఎమ్మెల్యేల ఫిరాయింపులను ఎదుర్కొన్నామని, అప్పుడు తెలంగాణ ప్రజలు తీవ్రంగా స్పందించి ఆందోళనను ఉధృతం చేయడంతో చివరికి కాంగ్రెస్ తల వంచవలసి వచ్చిందని గుర్తు చేశారు. చరిత్ర మరోసారి పునరావృతమవుతుందని కాంగ్రెస్ సర్కార్‌ను కేటీఆర్ హెచ్చరించారు. కాగా, కేటీఆర్ ట్వీట్‌పై నెటిజన్లు భిన్నంగా రియాక్ట్ అవుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను సంతల్లో పశువుల్లా కొన్నారని.. అప్పుడు ఈ విషయం గుర్తుకు రాలేదా..? అని నిలదీస్తున్నారు.

# పరీక్ష కోసం ఆందోళన..

## మాతృశ్రీ కాలేజీలో ప్రారంభం కాని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): సైదాబాద్ లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామకాల కోసం నిర్వహించే పోటీ పరీక్ష 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా రెండున్నర గంటల తర్వాత కూడా పరీక్ష ప్రారంభం కాలేదు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థుల తల్లిదండ్రులు, బంధువులు పరీక్షా కేంద్రం వెలుపల ఆందోళనకు దిగారు. బీజేపీ యువమోర్చా నాయకులు వారికి మద్దతు తెలిపారు. పరీక్ష ప్రారంభం కాకపోవడానికి సాంకేతిక సమస్యనే కారణమని చెప్తున్నారు. ఆన్లైన్ విధానంలో నిర్వహించాల్సిన పరీక్షకు ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రంలో కంప్యూటర్లను సిద్ధం చేయాల్సి ఉంది. కానీ సోమవారం ఉదయం కేంద్రానికి వచ్చి ఏర్పాట్లు వేయడంతో అవి పని చేయలేదు. అభ్యర్థుల ఆందోళన తెలుసుకున్న అధికారులు ఈ కేంద్రంలోని అభ్యర్థులకు పరీక్షను రీ షెడ్యూల్ చేశారు. ఈ మేరకు సంస్థ వెబ్ సైట్ లో సమాచారాన్ని పొందుపరిచారు.

# విధులను బహిష్కరించి జూనియర్ డాక్టర్ల నిరసన

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లల సమ్మె కొనసాగుతోంది. స్టైఫండ్ చెల్లింపులతో పాటు 8 డిమాండ్ల పరిష్కారం కోరుతూ జూడాలు సమ్మె బాట పట్టారు. ఓపీ అత్యవసర సేవలు మినహా మిగతా విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన రాలేదని, మూడురోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోకపోవడంతోనే సమ్మెబాట పట్టామని జూనియర్ డాక్టర్లు చెబుతున్నారు. గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి ప్రతినెల స్టైఫండ్ చెల్లించాలని, వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులతో కూడిన హాస్టల్స్ ఏర్పాటు చేయాలని జూడాలు డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 18న సమ్మె నోటీసులు ఇచ్చిన జూనియర్ డాక్టర్లు.. ఇవాళ్టి నుంచి విధులకు దూరంగా ఉంటున్నారు.



# టీ20 ప్రపంచకప్‌లో సౌత్ఆఫ్రికా ముందంజ

హైదరాబాద్, జూన్ 24 (ప్రజాస్వరం): టీ20 ప్రపంచ కప్ లో ఆతిథ్య వెస్టిండీస్‌ను చిత్తు చేసి దక్షిణాఫ్రికా చిత్తు చేసింది. సెమీస్‌కు దూసుకెళ్లాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో విండీస్ చివరివరకూ పోరాడింది. కానీ, దక్షిణాఫ్రికా కూడా పట్టు వదలకుండా విజయం సాధించింది. విండీస్ నిర్దేశించిన 136 పరుగుల లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా ఇబ్బంది పడింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 17 ఓవర్లకు కుదించి టార్గెట్‌ను 124 పరుగులుగా నిర్దేశించారు. చివరికి 16.1 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి సఫారీల జట్టు విజయం సాధించింది. స్వల్ప వ్యవధిలోనే ఓపెనర్లు డికాక్ (12), హెండ్రిక్స్ (0) వికెట్లను కోల్పోయింది. ట్రిస్టన్ స్టబ్స్ (29), క్లాసెన్ (22), మార్కో ఎన్‌సెన్ (21), మార్‌క్రమ్ (18) తలో చేయి వేసి లక్ష్యాన్ని ఛేదించారు. చివరి ఓవర్‌లో ఐదు పరుగులు అవసరమైన సమయంలో.. రబాడ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లోనూ మెరిశాడు. మూడు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాపై ఒత్తిడి తెచ్చాడు. ఆండ్రి రస్సెల్ (2/19), అల్జారీ జోసెఫ్ (2/25) కట్టుదిట్టంగా బంతులేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (52) హాఫ్ సెంచరీతోపాటు కేల్ మయేర్స్ (35) విలువైన పరుగులు సాధించాడు.